సాక్షి
శ్రీకాకుళం
ఆదివారం । 8 । డిసెంబర్ । 2024



అప్ప చేసి పప్ప కూడు

హాస్టళ్లకు మెస్ చార్జీలు విడుదల కావడం లేదు. దీంతో పాట్లు తప్పడం లేదు.

- 8లో




శ్రీకూర్మంలో పోలీస్ పికెట్

శ్రీకూర్మంలో పోలీస్ పికెట్ కొనసాగుతోంది. హత్య కేసులో పోలీసులు ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు.

- 8లో

పకడ్బందీగా ఉపాధి పనులు

ఎచ్చెర్ల క్యాంపస్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు పకడ్బందీగా అమలు కావాలని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ జి.సుధాకర్‌రావు అన్నారు. అల్లినగరంలోని వ్యక్తిగత తోటల పెంపకం, చెత్త నుంచి సంపద తయారీ సృష్టి కేంద్రం, ఫారం పాండ్, క్యాటిల్ షెడ్ల నిర్మాణ పనులు పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీవో శోభాదేవి, ఈసీ నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.



సిరుసువాడలో సాగు చేస్తున్న మిరప, అంతర పంట

ఆ ఊరి పేరు సిరుసువాడ. నిజానికి ఇదో సిరులవాడ. పవిత్ర వంశధార తీరంలో సంప్రదాయ సేంద్రీయ పద్ధతిలో కూరగాయలు పండిస్తూ జనాలకు ఆరోగ్యం అందిస్తున్నారీ గ్రామ వాసులు. తరతరాలుగా కూరగాయల సాగునే వృత్తిగా చేసుకుని బతుకుతున్నారు. ప్రపంచమంతా రసాయనాలపై ఆధార పడుతున్నా.. ఇక్కడ ఇంకా సేంద్రీయ పద్ధతులతోనే సాగు చేస్తున్నారు. మిరప నుంచి ముల్లంగి వరకు తోటకూర నుంచి కాలీఫ్లవర్ వరకు అన్ని రకాల కూరగాయలకు ఈ ఊరే కేరాఫ్.

సిరుల వాడ



సిరుసువాడలో సాగు చేస్తున్న క్యాబేజీ ఇతర పంటలు

- కూరగాయల సాగుకు కేరాఫ్ సిరుసువాడ
- తరతరాలుగా కూరగాయల సాగే వారి వృత్తి

కొత్తూరు:

వంశధార నదీతీరంలో ఉన్న సిరుసువాడ వందల ఏళ్లుగా కూరగాయలు పండిస్తోంది. ఈ గ్రామంలో పొందర సామాజిక వర్గం వారు అధికంగా ఉంటారు. కూరగాయల సాగు వీరి జీవనాధారం. మిగతా సామాజిక వర్గాల వారు కూడా కూరగాయల సాగుపైనే మక్కువ చూపిస్తున్నారు. ఈ గ్రామంలో 250 మంది రైతులు సుమారు 200 ఎకరాల్లో టమాటా, వంగ, క్యాబేజి పువ్వు, క్యాబేజి బుట్ట, దుంపలు, ఉల్లి, మిరప, ముల్లంగితో పాటు అన్ని రకాల ఆకుకూరలు సాగు చేస్తున్నారు. ఎప్పటి నుంచో సేంద్రీయ పద్ధతిలోనే వీరు సేద్యం చేస్తున్నారు.

సమీపంలోనే వంశధార ఉండడంతో తక్కువ లోతులో బోర్లకు, బావులకు నీరు వస్తాయి. దీంతో కూరగాయల సాగుకు అనువుగా ఉంటుంది. ఏడాదిలో కనీసం మూడు దఫాలు పలు రకాల కూరగాయలు పండించడంతో పాటు అంతరపంటలు కూడా వేస్తారు. వంగ, టమాట, మిరప, ఉల్లిలతో పాటు పలు రకాల కూరగాయల నారును పెంచుతారు. చుట్టుపక్కల గ్రామాల వారంతా నారు కోసం ఇక్కడకే వస్తారు. ఈ గ్రామం నుంచి రోజుకు అన్ని రకాల పంటలు సుమారు మూడు వేల నుంచి ఐదు వేల కిలోల వరకు కొత్తూరు మార్కెట్‌కు వస్తుంది. కొందరు రైతులు గ్రామాల్లో తిరుగుతూ విక్రయిస్తారు. తమకు రాయితీలు కల్పిస్తే మరింత ప్రోత్సాహకరంగా ఉంటుందని వారు చెబుతున్నారు.

తరతరాలుగా పండిస్తున్నాం..



కూరగాయల పంట తరాల నుంచి సాగు చేస్తున్నాం. సాగుకు పెట్టుబడి భారం పెరుగుతోంది. ఆదాయం బతకడానికి తప్ప ఏమీ మిగలడం లేదు.
– అర్జున పాత్రో, కూరగాయల రైతు, సిరుసువాడ



పలు రకాల కూరగాయల నారు



సిరుసువాడలో సాగు చేస్తున్న ఉల్లి పంట

కూరగాయ పంటలే ఆధారం



కూరగాయ పంటలే ఆధారంగా మేం బతుకుతున్నాం. వరికి మా భూములు అనుకూలం కావు. అందుకే కేవలం కూరగాయలు మాత్రమే పండించి వాటిపైనే ఆధారపడి బతుకుతున్నాం.
– బెహర కృష్ణ, కూరగాయల రైతు, సిరుసువాడ



● కళాకెరటం

పగటి వేషగాళ్ల ప్రదర్శన

అంతెత్తున ఎగిరిన హనుమను చూసి సిక్కోలు దారులు మురిసిపోయాయి. పగటి వేషగాళ్ల ప్రదర్శనలు కాలాన్ని అమాంతం వెనక్కి తీసుకెళ్లాయి. కొండ దాటి వచ్చిన గిరిజనుల అడవి పాట, తూర్పు భాగవతుల ఆటతో కళలు అలలై ఎగసిపడ్డాయి. శ్రీకాకుళం రంగస్థల సమాఖ్య పాతికేళ్ల రజతోత్సవం సందర్భంగా జరిగిన ప్రదర్శనలు అదరహో అనిపించాయి.
– శ్రీకాకుళం కల్చరల్



చెంచు భాగవత ప్రదర్శన



కళాకారుల ఊరేగింపు

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రతిభ కలిగిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం అందజేసే ఉపకార వేతనానికి అన్వేషణ మొదలైంది. నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షకు రంగం సిద్ధమైంది. ఆదివారం జరిగే ఈ పరీక్షకు విద్యాశాఖ అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరగనుంది. పరీక్ష కేంద్రాలకు ముందుగా చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. హాల్ టిక్కెట్‌లోని మార్గదర్శకాలను విధిగా పాటించాలని సూచిస్తున్నారు.

21 కేంద్రాలు.. 4907 మంది విద్యార్థులు

జిల్లాలో 21 కేంద్రాల్లో జరిగే ఈ పరీక్షకు 4907 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు.శ్రీకాకుళం, టెక్కలి, పలాస డివిజన్‌లలోని హెడ్‌క్వార్టర్స్ పాఠశాలలను కేంద్రాలుగా ఎంపిక చేసినట్టు జిల్లా విద్యాశాఖ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ లియాఖత్ ఆలీఖాన్ తెలిపారు.

ఎంపికైతే నాలుగేళ్లపాటు స్కాలర్‌షిప్..

ఈ ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలో ఎంపికైన విద్యార్థులకు ఏడాదికి రూ.12వేలు చొప్పున నాలుగేళ్లపాటు స్కాలర్‌షిప్‌ను కేంద్ర ప్రభుత్వం అందజేయనుంది. 9వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు అందించే రూ.48వేలు పేద, మధ్య తరగతి విద్యార్థులకు బాసటగా నిలవనుంది. ఏటా జిల్లా నుంచి 190 నుంచి 200 మంది వరకు విద్యార్థులు ఎన్‌ఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికవుతున్నారు. గతంతో పోలిస్తే ఈ ఏడాదే అతి తక్కువ మంది విద్యార్థులు దరఖాస్తు చేశారు.

బోధనతో పాటు పర్యవేక్షణ అవసరం: కలెక్టర్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): విద్యార్థుల్లో సత్తాను తెలుసుకునేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మీటింగ్స్ ఎంతో ఉపయోగపడతాయని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో ఉంటే విద్య దానంతట అదే వస్తుందన్నారు. ప్రతి విద్యార్థికి ఉపాధ్యాయుడి బోధన ఎంత అవసరమో తల్లిదండ్రుల పర్యవేక్షణ అంతే అవసమరన్నారు. చదువుతోపాటు క్రీడలు, వారి నైపుణ్యాలను వెలికితీసే కార్యక్రమాలకు ప్రోత్సహించాలన్నారు. కలెక్టర్‌తో పాటు కార్పొరేషన్ కమిషనర్ పి.వి.వి.డి ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

నాణ్యమైన భోజనం పెట్టడం లేదని నిలదీత

కొత్తూరు: కొత్తూరు మండలం వసప కేజీబీవీలో శనివారం జరిగిన తల్లిదండ్రులు, టీచర్ల సమావేశంలో తల్లిదండ్రులు సమస్యలు ఏకరువు పెట్టారు. విద్యాలయంలో నాణ్యమైన భోజనం పెట్టడం లేదని ఎస్‌ఓను పలువురు నిలదీశారు. భోజనాలు బాగులేవని పిల్లలుచెబితే టీసీలు ఇచ్చి పంపిస్తానని చెప్పడం సబబు కాదన్నారు. భోజనంలో పురుగులు పడితే తమకు చెప్పాలి తప్ప పేపర్లకు ఇవ్వడం సరికాదని ఎస్‌ఓ అన్నారు.



కొత్తూరు: సమావేశంలో భోజనాలను ఉద్దేశించి మాట్లాడుతున్న విద్యార్థి తండ్రి నీలంనాయుడు

రైస్‌మిల్లుల తనిఖీ

నందిగాం: మండలంలోని పలు రైస్ మిల్లులను జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెంటూరు వినాయక, అన్నపూర్ణ రైస్ మిల్లు, పెద్దలవునిపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పలాస ఆర్డీఓ జి.వెంకటేశ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కస్టోడియన్ అధికారులు సేవలను పరిశీలించారు. అలాగే ట్రక్‌షీట్ల ప్రకారం ధాన్యం మిల్లులకు చేరుతుందో లేదో పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ వివరాలపై ఆరా తీశారు. జేసీ వెంట తహసీల్దార్ సోమేశ్వరరావు, డీటీ రామారావు, సీఎస్ డీటీ అనిల్ పాత్రో, వీఆర్వో రాంజీ, అరుణ్ కుమార్, ఏఓ శ్రీకాంత్ వర్మ తదితరులు ఉన్నారు.

నిర్మానుష్య ప్రాంతాలపై డ్రోన్లతో నిఘా

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న నిర్మానుష్య ప్రదేశాలపై శనివారం డ్రోన్లతో పోలీసులు నిఘా పెట్టారు. ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు డ్రోన్లతో నిఘా పెట్టినట్లు ఎస్సై వి.సందీప్‌కుమార్ చెప్పారు. ఎచ్చెర్ల, చిలకపాలెం, కుశాలపురం, పొన్నాడ, ధర్మవరం, డి.మత్స్యలేశం, ఓలేటి అగ్రహారం ప్రాంతాల్లో డ్రోన్లతో నిఘా పెట్టారు. గంజాయి అమ్మకం, పేకాట వంటి వాటిని గుర్తించి చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని అన్నారు.

క్లుప్తంగా

విద్యార్థి మృతిపై కొనసాగుతున్న విచారణ

ఎచ్చెర్ల క్యాంపస్: ఎస్ఎంపురం ఏపీ గురుకుల పాఠశాల విద్యార్థి ముద్దాడ దిలీప్ మృతిపై విచారణ కొనసాగుతోంది. ఏపీ రెసిడెన్షియల్ సొసైటీ, పోలీసుల విచారణ చేస్తున్నారు. సొసైటీ తరఫున బొబ్బిలి గురుకులం ప్రిన్సిపాల్ కె.రఘునాథరావు శనివారం పాఠశాలకు వచ్చి వివరాలు తెలుసుకున్నారు. ఇక్కడ 2022 జనవరి 25న ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రెండేళ్ల వ్యవధిలో ఇద్దరు మృతిచెందడంపై ఆరా తీశారు. ఎచ్చెర్ల ఎస్సై వి.సందీప్‌కుమార్ ప్రిన్సిపాల్ ఎం.గుణస్వామితో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆత్మహత్యగా కేసు నమోదు చేసిన పోలీసులు పోస్టుమార్టం నివేదిక ఆధారంగా దర్యాప్తులో ముందుకు సాగే అవకాశం ఉంది. ప్రిన్సిపాల్ విధుల నిర్వహణ, కేర్ టేకర్ల పర్యవేక్షణ, పాఠశాలలో ఉండాల్సిన విద్యార్థులు బయటకు ఎందుకు వెళుతున్నారు? విద్యార్థుల వ్యక్తిగత పర్యవేక్షణ వంటి అంశాలపై సొసైటీ అధికారులు విచారణ చేస్తున్నారు.

ఉత్తమ మానవ వనరులతోనే దేశ ప్రగతి



మాట్లాడుతున్న డైరెక్టర్ కె.వి.జి.డి.బాలాజీ

ఎచ్చెర్ల క్యాంపస్: ఉత్తమ మానవ వనరులతోనే దేశ ప్రగతి సాధ్యమవుతుందని శ్రీకాకుళం ఆర్జీయూకేటీ (రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం) ఎస్ఎంపురం క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట గోపాల ధనబాలాజీ అన్నారు. ఎస్ఎంపురం క్యాంపస్‌లో కేంద్ర ప్రభుత్వ పిలుపు మేరకు వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా యువ భారత్ అంశంపై శనివారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు. జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అకడమిక్ డీన్ కొర్ల మోహన్‌కృష్ణ చౌదరి, పరిపాలనాధికారి ముని రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హిందువులపై దాడులు తగదు



రణస్థలంలో ర్యాలీ నిర్వహిస్తున్న హిందువులు

రణస్థలం: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను భారతదేశంలోని హిందువులంతా ఖండించాలని బ్రాహ్మణ, హిందూ సంఘ ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఈ మేరకు హిందువులకు రక్షణ కల్పించాలంటూ రణస్థలం మండల కేంద్రంలోని రామతీర్థం జంక్షన్ నుంచి తహసీల్దార్ కార్యాలయం మీదుగా రావాడ జంక్షన్ వరకు భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బంగ్లాదేశ్ వరదలలో తిండి పెట్టిన ఇస్కాన్ సభ్యులనే హింసించడం తగదన్నారు.

ఘనంగా యూత్ క్రిస్మస్ వేడుకలు



క్రైస్తవ గీతాలు ఆలపిస్తున్న యువత

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని డగ్లస్ స్కూల్ వద్ద కీస్టోన్ చర్చిలో శనివారం యూత్ క్రిస్మస్ ఘనంగా నిర్వహించారు. చర్చి పాస్టర్ జోయల్ జాన్ ఆధ్వర్యంలో యువత నృత్యాలు చేస్తూ.. గీతాలను ఆలపిస్తూ సందడి చేశారు. అనంతరం కేక్ కటింగ్, కొవ్వొత్తుల ప్రదర్శనలు జరిగాయి. కార్యక్రమంలో లిడియా జాన్, క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

గండం గట్టెక్కింది!



పల్టీలు కొట్టిన కారు



సెంటర్ డివైడర్‌పై ఇలా..



రక్షణగా నిలిచిన గోడ ఇదే

కొత్తరోడ్డు జంక్షన్‌లో జాతీయరహదారిపై శనివారం మధ్యాహ్నం ఓ కారు వేగంగా దూసుకొస్తూ అదుపుతప్పింది. రెప్పపాటులో సెంటర్ డివైడర్ పైకి వెళ్లింది. అక్కడ బోల్తాకొట్టి రక్షణ గోడ శివారును ఆగిపోయింది. వెంటనే స్పందించిన స్థానికులు, హైవే పోలీసులు కారు లోపల ఉన్న ఇద్దరిని బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియలేదు. – శ్రీకాకుళం రూరల్

అప్పు చేసి పప్పుకూడు!

- వసతి గృహాల్లో విడుదల కాని మెస్‌చార్జీలు
- అప్పులు చేసి విద్యార్థులకు భోజనాలు పెడుతున్న వార్డెన్లు
- ఐదు నెలల బకాయిలు పెండింగ్
- పట్టించుకోని ప్రభుత్వం



నరసన్నపేట బీసీ బాలికల వసతి గృహంలో భోజనాలు చేస్తున్న విద్యార్థులు

బీసీ వసతి గృహాలు	బీసీ విద్యార్థులు	ఎస్సీ వసతి గృహాలు	ఎస్సీ విద్యార్థులు
79	7100	30	2812

నరసన్నపేట:

ఓవైపు పెరిగిన నిత్యావసర సరుకులు ధరలు.. మరో వైపు పెరగని మెస్ చార్జీలు.. దీనికి తోడు నెలల తరబడి మెస్ చార్జీలు చెల్లించని ప్రభుత్వం. దీంతో జిల్లా వ్యాప్తంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ వసతి గృహాల వార్డెన్లు, మేట్రిన్లు విద్యార్థులకు భోజనాలు పెట్టేందుకు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. కిరాణా షాపులకు, చికెన్ దుకాణాలకు, గుడ్ల వర్తకులకు సకాలంలో డబ్బులు చెల్లించలేక అవస్థలు పడుతున్నారు. ఐదు నెలలుగా ఇదే పరిస్థితి నెలకొనడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 50 మంది విద్యార్థులు ఉన్న వసతి గృహానికి నెలకు కనీసం రూ.60 వేలు ఖర్చు అవుతుంది. అంతకంటే ఎక్కువ మంది విద్యార్థులు ఉంటే ఖర్చులు మరింతగా ఉంటాయి. నరసన్నపేట బీసీ బాలికలు వసతి గృహంలో 240 మంది పిల్లలు ఉన్నారు. ఇక్కడ మెస్ చార్జీలు రూ.లక్షల్లో ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. కొన్ని హాస్టళ్లకు జూన్ నుంచి బిల్లులు చెల్లించాల్సి ఉండగా.. మరికొన్నింటికి ఏప్రిల్ బకాయిలు కూడా అందాల్సి ఉందని జిల్లా సంక్షేమాధికారులు చెబుతున్నారు. ఇలా అయితే ఎలా వసతి గృహాల నిర్వహణ కష్టమని వాపోతున్నారు. బిల్లులు చెల్లించకపోగా మెనూ మాత్రం తూచా తప్పకుండా అమలు చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేస్తుండటం గమనార్హం.

పెరిగిన ధరలతో బెంబేలు..



నెలల తరబడి బిల్లులు రాక ఒక వైపు వార్డెన్లు అప్పులు పాలు చేస్తుంటే పెరిగిన ధరలకు మరింతగా ఇబ్బందులు పడుతున్నారు. మెనూ ప్రకారం ఒక్కో విద్యార్థికి వారానికి 6 రోజులు గుడ్డు ఇవ్వాలి. ఒక్కో గుడ్డుకు ప్రభుత్వం రూ.5 చెల్లిస్తుంది. మార్కెట్‌లో గుడ్డు ధర రూ.7కు పైగా ఉంది. చికెన్ ప్రీ మెట్రిక్ వసతి గృహాల్లో వారానికి మూడు సార్లు, పోస్టు మెట్రిక్ వసతి గృహాల్లో వారానికి రెండు సార్లు ఇస్తున్నారు. ప్రభుత్వం కేజీ చికెన్‌కు రూ.100 చెల్లిస్తుంది. బహిరంగ మార్కెట్‌లో రూ.150 నుంచి రూ.200 పైబడి ఉంటుంది. అలాగే కందిపప్పు ఒక్కో విద్యార్థికి 20 గ్రాములు ఇవ్వాలి. ప్రస్తుత ధర రూ.180 ఉంది. ఆదివారం పూరీ, మంగళవారం, శనివా రం ఇడ్లీ ఇవ్వాలి. మినపగుళ్లు, ఆయిల్ రేట్లు కూటమి ప్రభుత్వం వచ్చాక ఎంతగా పెరిగాయో అందరికీ తెలిసిందే. ఈ పరిస్థితుల్లో నెలవారీ బిల్లులు వచ్చినా వార్డెన్లకు చేతిచమురు వదలక తప్పదు. అలాంటిది నెలలు తరబడి బిల్లులు రాకపోవడంతో ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

పెరగని మెస్‌చార్జీలు..

పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా మెస్‌చార్జీలు పెంచాలని విద్యార్థి సంఘాలు, వార్డెన్లు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. 2023లో అప్పటి ప్రభుత్వం మెస్ చార్జీలు పెంచింది. ప్రస్తుతం ఇవే అమలు అవుతున్నాయి. 3, 4 తరగతుల విద్యార్థు లకు నెలకు రూ.1250, ఐదు నుంచి పదో తరగతి విద్యార్థులకు నెలకు రూ.1400 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తుంది. ఇంటర్, ఆపైన తరగతుల విద్యార్థుల కు నెలకు రూ.1600 చెల్లిస్తుంది. ఈ చార్జీలు అప్పటి ధరలు బట్టి నిర్ధారణ చేశారని, ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా మార్పు చేయాలని వారు కోరుతున్నారు.

బిల్లులు పంపించాం



జిల్లా వ్యాప్తంగా బీసీ వసతి గృహాల్లో ఐదు నెలల మెస్ చార్జీల బిల్లులను ప్రభుత్వానికి పంపాం. త్వరలో వస్తాయని అధికారులు చెబుతున్నారు. ఈ విషయం వార్డెన్లకు తెలియజేశాం. బిల్లులు వచ్చిన వెంటనే వార్డెన్ల ఖాతాలకు జమచేస్తాం.

– అనూరాధ, జిల్లా బీసీ సంక్షేమాధికారి

వెంటనే బిల్లులు చెల్లించాలి..



ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ బిల్లులు చెల్లించాలి. ఐదు నెలలుగా బిల్లులు రాక పోయినా, నిత్యవసర సరుకులు ధరలు పెరిగినా మెనూ కచ్చితంగా అమలు చేస్తున్నాం. మా ఇబ్బందులనూ ప్రభుత్వం గమనించాలి. అప్పులు వాళ్లూ మాపై దాడికి దిగక ముందే బిల్లులు వస్తే వారికి చెల్లిస్తాం. ప్రస్తుతానికి ఇంకా అప్పు చేయలేం.

– గురువులు, వార్డెన్ల సంఘం జిల్లా అధ్యక్షుడు

ఉన్నతాధికారులకు చెప్పాం..



ఐదు నెలలుగా బిల్లులు రావాల్సి ఉంది. నెల వారీగా చెల్లించాల్సిన బిల్లుల వివరాలు ప్రభుత్వానికి పంపించాం. వస్తాయనే అనుకుంటున్నాం. క్షేత్రస్థాయి పరిస్థితిని ఉన్నతాధికారులకు వివరించాం. ప్రభుత్వం త్వరగా చెల్లిస్తుందనే అనుకుంటున్నాం.

– విశ్వమోహన్ రెడ్డి, సాంఘిక సంక్షేమ వసతి గృహాల డీడీ


ప్రభుత్వ పాఠశాలలకు చేయూతనివ్వండి



పీటీఎం సమావేశంలో విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి: సొంత గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుని విదేశాల్లో స్థిరపడిన వారంతా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సాయం అందజేసే విధంగా జన్మభూమి-2 కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. శనివారం కోటబొమ్మాళి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పేరెంట్ టీచర్ సమావేశంలో భాగంగా మంత్రి మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో పలు పాఠశాలలను ఎత్తేయడంతో గోదాములుగా మారాయని చెప్పారు. త్వరలోనే డీఎస్సీ నిర్వహిస్తామని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలలను ధీటుగా మార్చేందుకు తల్లిదండ్రుల బాధ్యతను గుర్తు చేయడానికి ఇలాంటి కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలో జనాభా పెరుగుదలకు సీఎం చంద్రబాబు ప్రత్యేక నిర్ణయాలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. గంజాయి కట్టడికి ఈగల్ సంస్థ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, టెక్కలి ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తి, మండల విద్యా శాఖాధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో విశ్రాంత హైకోర్టు జడ్జి



విశ్రాంత జస్టిస్ సీతారామమూర్తికి జ్ఞాపిక అందజేస్తున్న ఈఓ

శ్రీకాకుళం అర్బన్: ప్రత్యక్షదైవం అరసవల్లి సూర్యనారాయణస్వామిని విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి సీతారామమూర్తి శనివారం దర్శించుకున్నారు. ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఘన స్వాగతం పలికి ఆలయ విశిష్టతను వివరించారు. అనివెట్టి మండపంలో వేద మంత్రాలతో ఆశీర్వదించారు. ఈవో వై.భద్రాజీ, ఆలయ సూపరింటెండెంట్ ఎస్.కనకరాజులు స్వామివారి జ్ఞాపికను అందజేశారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు దివ్యాంగుల జట్టు పయనం

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి దివ్యాంగుల క్రికెట్ టోర్నీలో రాణించి టైటిల్‌తో తిరిగిరావాలని జిల్లా దివ్యాంగుల క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి ఆకాంక్షించారు. ఈ నెల 8 నుంచి 12 వరకు విశాఖపట్నంలో జరగనున్న రాష్ట్రస్థాయి దివ్యాంగుల క్రికెట్ పోటీలకు శనివారం జిల్లా జట్టు ఇక్కడ నుంచి పయనమై వెళ్లింది. ఎమ్మెస్సార్ తనవంతు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి అర్జున్‌రావురెడ్డి,బి.రామకృష్ణ పాల్గొన్నారు.

హోరాహోరీగా ఖోఖో పోటీలు



విజేత జట్టుకు బహుమతి అందిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి

కాశీబుగ్గ: అంతర్ కళాశాలల ఖోఖో పురుషుల, మహిళ ఎంపిక పోటీలు శనివారం పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో హోరాహోరీగా నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల విద్యార్థులు హాజరయ్యారు. మహిళల విభాగంలో ఎస్‌బీఎస్‌వైఎం డిగ్రీ కళాశాల(కాశీబుగ్గ) ప్రథమ, ఎస్‌పీఎస్ఆర్ డిగ్రీ కళాశాల(రాజాం) ద్వితీయ, అంబేడ్కర్ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజ్ తృతీయ స్థానాలు సాధించాయి. పురుషుల విభాగంలో శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రథమ, పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ద్వితీయ, బారువ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తృతీయ బహుమతులు కైవసం చేసుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి, అంబేడ్కర్ వర్సిటీ డీన్ ఆఫ్ స్పోర్ట్స్ డాక్టర్ భాస్కరరావు, పీడీ డాక్టర్ పి.మధు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం

తమ్మినాయుడుపేటలోని అమ్మా సంస్థాన్‌లో శనివారం సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా స్వామివారి కల్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీపాద సురేష్ శర్మ ఆధ్వర్యంలో వల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి మూర్తులకు సంప్రదాయబద్ధంగా కల్యాణం జరిపించారు. ఆలయ ధర్మకర్త సాగి శ్రీనివాస వర్మ, భక్తులు పాల్గొన్నారు. – శ్రీకాకుళం కల్చరల్



మాదక ద్రవ్యాలతో జీవితం నాశనం



'మాదకద్రవ్యాలు వద్దు బ్రో' పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి, తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: పిల్లల ప్రవర్తనని తల్లిదండ్రులు ప్రతి రోజూ కనిపెడుతుండాలని, ముఖ్యంగా డ్రగ్స్ బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి పేర్కొన్నారు. శ్రీకాకుళం గుజరాతీపేటలోని ఏవీఎస్ఎంహెచ్ స్కూల్‌లో శనివారం నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ ఆలయన మాట్లాడుతూ మాదవ ద్రవ్యాలతో జీవితం నాశనం అవుతున్నారు. ప్రస్తుత కాలంలో సెల్‌ఫోన్ల వల్ల విషయ పరిజ్ఞానం తెలియడంతో పాటు అనర్థాలు కూడా చాలా ఉన్నాయని గ్రహించి విద్యార్థులు మంచి కోసం మాత్రమే మొబైల్ ఫోన్లు వాడాలని సూచించారు. సైబర్ నేరాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం 'మాదకద్రవ్యాలు వద్దు బ్రో' అనే పోస్టర్లను అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎస్పీ వివేకానంద, రామనాథరావు, అంధవరపు సంతోష్‌కుమార్, ప్రసాద్‌రావు, టూ టౌన్ సీఐ ఈశ్వరరావు, ఎస్సై సంతోష్, పేరెంట్స్ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్రీకూర్మంలో పోలీస్ పికెట్



మృతుడు రాజేష్ ఇంటి వద్ద పోలీసులు

గార: శ్రీకూర్మంలో శుక్రవారం రాత్రి ఉప్పాడ రాజేష్ అనే వ్యక్తి హత్యకు గురైన నేపథ్యంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. మృతుడు రాజేష్ ఇంటి వద్ద, రెడ్డిక వీధిలో శనివారం పోలీసులు పహారా కాశారు. డీఎస్పీ సీహెచ్ వివేకానంద, సీఐ పైడపునాయుడు, ఎస్ఐ రెల్ల జనార్ధనరావులు శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్నారు. మరోవైపు, తీవ్ర గాయాలతో రిమ్స్‌లో చికిత్స పొందుతున్న చుక్క రామును మెరుగైన వైద్యం కోసం శనివారం ఉదయం విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. రాజేష్ మృతదేహానికి పోస్టుమార్టం పూర్తిచేసి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

పోలీసుల అదుపులో ఆరుగురు..!

హత్య ఘటనకు సంబంధించి ఆరుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. మొత్తమ్మీద ఎనిమిది మంది వ్యక్తులకు ఇందులో ప్రమేయం ఉందని ప్రాథమికంగా నిర్ధారించిన పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపడుతున్నారు. శ్రీకూర్మం సమీపంలోని చింతువలస వద్ద ఉన్న స్థలానికి సంబంధించి రాజేష్ సమీప బంధువు ఉప్పాడ రాములమ్మ, కొయ్య భాస్కరరావు కుటుంబ సభ్యుల మధ్య వివాదం ఉంది. ఈ వివాదంలో జిల్లా కోర్టు, జేసీ కోర్టు, హైకోర్టులో రాములమ్మకు అనుకూలంగా తీర్పు వచ్చినట్టు తెలుస్తోంది. ఆ తర్వాతే ఉప్పాడ సూర్యనారాయణతో పాటు గాయపడ్డ చుక్క రాము, అనపాన షణ్ముఖరావులు ఆ భూమిని కొనుగోలు చేశారు. దీంతో కొయ్య భాస్కరరావు కుటుంబ సభ్యులు దాడిచేయడానికి ప్రణాళిక వేసుకున్నట్టు భావిస్తున్నారు. ఆ సమయంలో సూర్యనారాయణను కూడా టార్గెట్ చేసినా హైస్కూల్ ప్రహరీకి ఆనుకుని ఉన్న పాన్ షాపుల కింద దాక్కోవడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. కాగా, భూ తగాదాలో హతుడు రాజేష్‌కు నేరుగా ప్రమేయం లేదు. సూర్యనారాయణ, రాములమ్మలకు మద్దతుగా ఉన్నాడనే అక్కసుతోనే హత్య చేశారా? పేకాట డెన్ లావాదేవీల వివాదం ఉందా? అన్న విషయంపై స్పష్టత లేదు.

పాతపట్నంలో ప్రొటోకాల్ రగడ



ఏపీవో సురేష్‌ను ప్రశ్నిస్తున్న ఎంపీటీసీలు, సర్పంచ్‌లు

- అధికారులను నిలదీసిన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు
- రసాభాసగా మండల సర్వసభ్య సమావేశం

పాతపట్నం: మండల సాధారణ సర్వసభ్య సమావేశం రసాభాసగా మారింది. ప్రొటోకాల్‌పై ప్రజాప్రతినిధులు తీవ్రస్థాయిలో ప్రశ్నించడంతో గందరగోళం ఏర్పడింది. పాతపట్నం మండల పరిషత్ కార్యాలయంలో సమావేశ మందిరంలో ఎంపీపీ దొర సావిత్రమ్మ అధ్యక్షతనలో శనివారం సాయంత్రం మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ఏపీవో సురేష్ మాట్లాడుతుండగా.. ఇటీవల జరిగిన సీసీ రహదారుల శంకుస్థాపనల శిలా ఫలకాల్లో సర్పంచ్, ఎంపీటీసీ పేర్లు లేవని.. టీడీపీ నాయకులు, కాంట్రాక్టర్ పేర్లు మాత్రమే ఉన్నాయని, కార్యక్రమాలకు కనీసం ఆహ్వానం అందించలేదని ఎంపీటీసీలు కొండల యరకయ్య, అర్జునుడు, పోలాకి రేణుక, అమర ఉషా, మద్దు సుగుణలు, సర్పంచ్‌లు మిరియబిల్లి అప్పలనాయుడు, డకర చిన్నారావు ధ్వజమెత్తారు. అనంతరం వాకౌట్ చేశారు. ఎంపీడీవో చంద్రకుమారి, మండల ప్రత్యేకాధికారి ఎం.కరుణకరరావులు సర్పంచ్‌లను, ఎంపీటీసీలు వారించినా ఫలితం లేకపోయింది. ప్రొటోకాల్‌పై మండల అధికారులు పట్టించుకోవడం లేదని, డీఈలు, జేఈలు, కాంట్రాక్టర్లు ఏకమై పనులు చేసుకుంటున్నారని, ఇదే విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు. అంతకుముందు మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఇంకా ఏర్పాటు చేయకపోవడంపై సభ దృష్టికి తీసుకొచ్చారు. ధాన్యం కొనుగోలు వారం రోజుల నుంచి చేపడుతున్నామని ఏఏవో భారతి తెలిపారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, వైద్యులు సదాశివ, షణ్ముఖరావు, శివకుమార్, జేఈ ప్రసాదరావు, పశువైద్యులు, మండల అధికారులు పాల్గొన్నారు.